మాత్రం "వాడికర్మ వాణ్ణేకుడిపింది" అని అనుకుంది. ఎంచేత? తన కాయశక్తులా తంటాలు పడింది, కల్లుదొప్ప పాటుపడే గుసపానికంటరాదని. కాని సహవాసదోషం తప్పించడానికి సాధ్యంకాక పోయింది, భాగ్యదేవతకైనాను.

పైదయ్యకు మళ్ళీ కల్లోసినవాళ్ళూ లేరు కలోసినవాళ్ళూ లేరు—పాపం!

.... .... .... .... ....

## అసంతృప్తి ఆనందం

రస్తా వెడల్పిచ్చింది. తుడిచేవాళ్ళు సంఖ్యలో ఎక్కువైనారు. రస్తారాటు హెచ్చైంది. తుడిచేవాళ్ళు కొత్తగా దిగుమతి అయినారు. అయితే లోకంలో అసంతృప్తి? అది అలాగేవుంది. నడిచేవాళ్ల తుడిచేవాళ్ళతోను, తుడిచేవాళ్ల నడిచేవాళ్ళతోను ఎంత కలిసిపోతూవున్నా ఆదిసమస్య ఆదిసమస్యగానే నిల్చివుంది.

ఆదిసమస్య అనగా ఆకలిసమస్య—"శిశువు కేరుమనడం తోనే తల్లి అక్కునచేర్చుకు పాలు అందిచ్చేటట్టు అందరియొక్క అందుబాటులోను భగవంతు "డున్నాడు! ఉన్నాడు!" అని ప్రతి మతము ప్రతి మార్గదర్శి ప్రకాశమానంగా పలకడమేగాని పరీక్షయిచ్చిన వాడు వొక్కడూ లేడు. మనందఱకూవున్నా వాళ్ళకులేదు. వాళ్ళకు భగవంతుడూలేడు, భగవద్ప్రవక్తాలేడు. ఆ యుభయం లేమితో పాటు ఇహభయంలేదు పరభయంలేదు. కాని అహంజ్యోతి? అది ఎవనిలో వానికే ఆ గుంపులో ఆ యుదయం తొణికిసలాడి పోతూవుంది. ఈ తుడిచేది తాను

ఈ నడిచేది తాను అనే యేర్పాటు వేయిమందిలో వేయి ఆత్మ లుగా విజృంభించి ఇసుక రేణువుల ఆధారాన్ని పరమాణువులై పైకి లేచిపోవడం నూతనభాసూదయకాంతిలో విశదపడుతూవుంది.

* * * * *

"ఏనాది సిన్నిదాన్ని ! - ఏటిమీద ఎనిమిదేండ్లు
పాటిమీద పాతికేండ్లు - పండబెడితె పచ్చగుంట
నిండబెడితె నీటుగుంట - కొప్పునిండ పూలుతురిమి
కొలువ గలనురా ! - నిప్పుమధ్య నీతి మొలక
నిలపగలనురా ! - బేరమాడి పోకురా
దూరమడిగి రాకురా - సొప్పుకొ నా పేరు !
తప్పుకు పొయ్యేరు - ఎల్లాంటయ్యోరు
తెల్లటి దొరగారు."

అని యొకచిన్నది పాడుతూ చీపురుతో రస్తా తుడుస్తూ చీపురు దుమ్ము—నడుస్తూ వస్తూ ఉన్న ఒకానొక జాతివాని ఛాతీమీదకు—చేటతో ఎత్తిపోసినట్టు పోసింది. ఆ జాతిదొర టోపీ తీసుకు ముఖాన్ని చాపెట్టుకు తనను తప్పుకు పొయ్యేటట్టు చేసింది. అతి వొయ్యారంగా తన యీడుజోడు తుడుపుడుగాని కేసి చూసింది.

వాడు—ఆ యీడు జోడు తుడుపుడుగాడు—ఆ సమయాన కేదో తన పాట యిలా పాడుతూ వూడుస్తూన్నాడు. పైదానికేసి చూస్తూనే దాన్ని వింటూనే—

"కోరలమ్మకున్న మహిమ - పీరులమ్మ కున్నదే ?
హోరువానకున్న మెఱుము - వొఱుపులుగ్గి కున్నదే ?
బొమ్మలాటకున్న వెలుగు - సెమ్మఆట కున్నదే ?
అమ్మకైపు కున్న తెలివి - జిమ్మకైత కున్నదే ?"

అని పాడుతూ ఊడుస్తూ—తన దిశగా వస్తూవున్న ఓ సాహెబ్ గడ్డంలో చిక్కుపడేటట్టు—తట్టెడు చెత్త దారినదాన్ని

జారపోశాడు. సాహేబు ఆ చెత్త నొక్క దాటుదాటి వాణ్ణి తప్పుకుపోయాడు. గడ్డంసాహేబు గంతుచూచి పక్కనవవ్వింది పిల్ల. మగవాడు ఈలవేశాడు. చిన్నది చిరునవ్వు నవ్వుతూ యీలగాని దగ్గరకువచ్చి యిలా ప్రస్తావించింది.

"పాలకేమి సత్తువుంది? - నీళ్ళకుందిరా !—పేద
నీళ్ళకుందిరా !.... - పూలకేమి సత్తువుంది ?
రాలకుందిరా !—ప్రేలు - రాలకుందిరా !....
ఈలకేమి సత్తువుంది ? - గాలికుందిరా ! ఈసు
గాలికుందిరా !....

* * * * *

ఆ ప్రస్తావన పరిసమాప్తి కాకుండానే వాళ్ళిద్దర్ని— ఆ మాత్రం దూరాన్నుంచి — మోటార్ కారు ముందుసీటున కూర్చుని కమీషనర్ కనిపెట్టి—"తిండికి లేదంటూనే—అన్యోన్యం పరాసికాలాడుకుంటారు !—వీళ్ళను తక్షణం నవుకరీలోంచి తీసెయ్యండి" అని వెనకసీటులో కూర్చున్న ఆరోగ్యశాఖాధికారికి సలహాయిచ్చాడు.

ఆరోగ్యశాఖాధికారి "చిత్తం ! వీళ్లు, వాళ్ళల్లోవాళ్లు చేసికొనే చిలిపిచేష్టల్తోనే కాకుండా, హడ్సన్ దొరగారిమీద దుమ్ము పోసి; ఇమామ్‌సాహేబుగారిముందు చెత్త విదిపి అతి రౌడీలుగా ప్రవర్తించారట నేటిచ్చుదయం." అని మఱికొన్ని నేరాలు గుదిగుచ్చాడు.

కమీషనర్ తక్షణం ఆ ఏనాది జోడాకాడ తనకారు ఆపి "ఓసి ! పిల్లా ! నిన్నే ! నీవు ! ఇలారా ! నిన్ను పనిచెయ్యడానికి పెట్టినామా ? ఇక్కడ నీ మగాడితోకూడి కన్నుగిలపడానికి పెట్టినామా ?" అని అడిగాడు.

ఏనాది యువకుడు ఆరోగ్యశాఖాధికారికి నమస్కారము పెడుతూ బొంగువంపు అయిపోయినాడు.

చిన్నది ఏమన్నా తనచేతి చీపురక్కడ పడేసి "వాడు చేస్తే చేసేనుగాక ఈ చిల్లరసేవ—నేను చేయలేను! వాడు వంగితె వంగేనుగాక! నేను వంగలేను. నేను వందనం సేయలేను!" అని అంటూ ఓ పాట వాళ్ళందఱిమీదకూ విసిరింది. ఓ పాట తనలో ముసురుకునేటట్టు చేసికొంది. ఎన్నిపాటలైనా చరణాలన్నే! పది!

"జారుపయట సర్దుకోను - జరుగుతుంటెగా?
వీడు జుత్తువేసికోను - వ్రేల్లపోతెగా?—
చేత చీపురట్టియూడ్వ - మూతికి దుమ్ము
కుళ్ళుచెత్త యెత్తియూడ్వ - ముక్కుకు కంపు—
మనిషికసలు పుట్టినాన? - మనసన్నది ఉన్నదేన?

అని గొంతెత్తి, గొంతుమార్చి, గొంతుదాచి—ఆ గుంపును, ఆ గోవాళ్ళను, ఆ గోష్టిని, విడిచిపెట్టి ఇరవైగజాలు ఉత్తరపు తెలిపినే గస్తునడక నడచింది.

*  *  *  *  *

అంతలో ఆమెకు వినిపించింది ఒకానొక రంగురంగుల బండి తన వైపునకు వస్తూవున్న చిరుగంటల యులివు. కనిపించాడు బండితో కూడా ఓ సన్యాసి.

నమస్కరించింది ఏనాదిచిన్నది ఆ సన్యాసికి. సన్యాసి నమస్కార మందుకుంటూ "నీ కేంపడవేయాలని వుందో పడవెయ్యి ఈ డబ్బిలో" అన్నాడు.

చిన్నది "పడవేత! పడవఏల!" అని వెకలిగా నవ్వింది. ఆ నవ్వుకు హడలిపోయి ఆ సన్యాసి ఆమెనుండి ఓర

సిల్లి వంకరగా బండి నడుపుకు పోయేడు. వెంటపడింది. ఎన్ని వంకర లా బండి తిరిగిపోతూ ఉంటే అన్ని వంకరలు తాను కూడా తిరిగిపోతూ అన్నివంకరలూ తన పాటకు చేకూరుస్తూ యీలా పాడదొడగింది.

" కారునలుపు రాయిదెచ్చి - కన్నుచెక్కి పన్నుచెక్కి
వెన్నుచెక్కి చెన్నుచెక్కి - అన్నపూర్ణ అంచు దాని
నాదరింతురా ? - కన్నుకలిగి పన్నుకలిగి
వెన్నుకలిగి చెన్నుకలిగి - సలువచేతి నాణెమునయి
మ్రోగుతున్న నన్ను చూచి - యెత్తిగిలేరా ?

* * * * *

కూడాకూడా తిరిగింది కావడంచేత నాడాసన్యాసికికూడు ఎక్కడెక్కడ ఏలాఏలా ఎంతెంత దొరికిందో కనిపెట్టకలిగింది.

ఇక గుడి అక్కడకు ఫర్లాంగు మేరలోవుంది. ఎదూరుగా కొండమీద. వందమందికి పైగా " అన్నపూర్ణ సన్యాసులు " కడపరాల పళుపులెక్కి అన్నంబండికోసం నిరీక్షిస్తూ ఉన్నారు. ఆ నిరీక్షణలోనే జేగంటమోగిస్తున్నారు. జతరుంజలు వాయిస్తు న్నారు. " మాతా! అన్నపూర్ణ భవానీ ! " అని హారతి వెలిగిస్తున్నారు.

బండి అంతకంతకు త్వరగా నడుస్తూవుంది గుడివంకకు. బండితోలే సన్యాసి వెనక ముందులు చూడకుండా ఎద్దు ముక్కు తాడు ఆడిస్తూ గ్రుడ్లనిప్పులు గురియిస్తున్నాడు.

ఏనాది చిన్నదాని కర్థంకావడంలేదు ఆ దృశ్యం అంతా— దానికర్థం అవుతూవున్నదల్లా సొంత కాలిమంట, సొంత కడుపు కాల్పు. మా అమ్మా ! మాడపట్టు మట్టమధ్యాహ్నమైయుంది.

* * * * *

గుడి అరుగులమీదను, గుడిముందరి నంది యిరుచాయలను, నంది యీవలి ధ్వజస్తంభపు పొడుగు నీడను విస్తళ్లువేసి, విస్తళ్ళల్లో షడ్రసోపేతంగా పదార్థాలు వడ్డించేస్తూ వున్నారు! కూర్చున్నారు కొదువలేకుండా ముదుసలి సన్యాసులు. కొదమ సన్యాసులు, ప్రధమ సన్యాసులు, అధమ సన్యాసులు—కావి జోలె తగిలించుకున్న ప్రతీ ప్రాణికీ ఉంది ప్రవేశం ఆ ప్రాంగణంలోకి—ఇతరులకు లేదు.

ఇతరుల కది రహదారికాదు అని అతి నాగరీకంగా అతి నేవళీకంగా వ్రోవనున్న ఓ తాటిచెట్టుమీద చెక్కబడివుంది. దేవలోకంటూ.

మఱిన్ని నిరక్షరకుక్షుల కొరకా అన్నట్టు రెండు వేట కుక్కలు ఆ చెట్టునే కట్టివేయబడి కనిపిస్తూ వున్నాయి; ఎవరైనాసరే అప్పటికప్పుడు కరవడానికి విడువబడే మహా స్వేచ్ఛపు వక్రతను వెల్లడిస్తున్నాయి కూడాను అవి.

ఆదాకా బోధ పడని దృశ్యము భయానకమైపోయింది ఏనాదిదానికి. "అది రహదారి కాకపోతే ఏది తనకు రహదారి?" అనే ప్రశ్న ఆవరించివేస్తూవుంది ఆమెను. ఆ ప్రశ్న ఆవరిస్తూన్న కొద్దీ ఆమెకు తల తిరిగిపోసాగింది. తల తిరిగిపోతూవుంది అన్నసంగతి ఒకరితో వెంటనే వెళ్ళబోసికోవాలని వున్నా వినేవారేరీ?

"గుడి వెనక్కుపోయి ఉండు." మన్నట్టు ఎదో సంజ్ఞ కనిపించింది. "బండెడన్నము తోలుకువచ్చి యింతమందికి కడుపునిండబెడుతూన్నవాడు ఆ జగన్నాధుడు నన్ను మఱచి పోతాడా? నాయనా! నీ బండికూడా వచ్చినందు కెదో సంజ్ఞ

చేసినావే?" అని గుడికి దూర దూరంగా నడుస్తూ గుడియొక్క వెనుకభాగానికి చేరుకుంది చిన్నది, ఆ వెఱ్ఱిది.

అక్కడ, కొండ ఎత్తుగా ఎగురుతూవున్న ఉదధి లోతుగా అణగారుతూవున్న, ఉదుటుతో అదురుతూవున్నా కుదురుతో ఐక్యమౌతూవున్న, ఎండాకులు, ఏనాటి ఆకులో గలగలమంటూ వున్నాయి. పైనున్న ఏచెట్టయినా రాల్చిన కారాకులేమో అని నీడ ఆశను పైకిచూచింది. కాని పిల్లకేచెట్టూ ఆ ఆకులమీదను కనుపించలేదు. కనిపించలేదు సరికదా ఆశకొద్దీ వేసిన అడుగు ఆకుల్లోకి దించుకుపోయి ఆ దురదృష్టవంతురాలి నలా ఓ పెద్ద కనబడని గోతిలోనికి దించివేసింది.

దించివేయక దిద్దితీరుస్తుందా? అదొక పాడునుయ్యి. నుయ్యి ఎండిపోయినా మహామత్స్యాలకింకా నెలవు అనేవాడుక. నూతి అడుక్కి వెళ్ళిపోయింది ఏనాదిచిన్నది. వింటున్నారా? కథ?

* * * * *

....సన్యాసులు గుడిముందు ఓంకారధ్వనితో ప్రాణాహుతులు పుచ్చుకుంటూవుంటే ఏనాది చిన్నది గుడివెనుక హాహారావంతో అన్నపూర్ణాదేవియొక్క విజీర్ణపత్రాల క్రింద మృతవారింది. కేవలం దేవి విజీర్ణపత్రాలే అయితే అంతచేటు చేటు వాటిల్లేది కాదేమో? ఆ ఆకులు మనుష్యసన్యాసుల నికృష్టోచ్ఛిష్ట ప్రేతాలు....ఈ జీవిపడగానే ఆ ప్రేతాల్లోంచో ఆ ప్రాతనూతి లోంచో ఓ చెకుముకి రారాయిడి చెణుకు ఆవిర్భవించి వెంటనే ప్రచండాగ్నిజ్వాల నెత్తించింది. ఏదీ గుడి? ఏరీ సన్యాసులు? అన్నంతలో తగులడి పోయినారు!

ఎవరు అన్నంతలో? ఏనాది కోడెకాడు అన్నంతలో? ఏమని అన్నంతలో? "ఏడీగుడి? ఏరీసన్యాసులు?" అని అన్నంతలో. అయినప్పటికిన్నీ ఆ జ్వాల నింకా బయలుమీద కుసికొలుపుతూనే వున్నాడు వాడు. "ఒరేయి! ఇదేంపనిరా! నీ భార్య యెక్కడుందిరా?" అని ఎవరైనా పరామర్శిస్తే

"పాటిమీద ఏరుతీస్తే - పడవకేమి లోటయా!
పాతికలో ఎనిమిదోతె - పదిహేడే కాదయా!

ఎక్కడో వోదిక్కున కాపడుతుంది." అంటూ కృతి కపశ్రుతి నివారించేడు.

.... .... .... .... ....

## "ఇద్" పండగ

అతణ్ణి మేమంతా "పఠాన్" అనేవాళ్ళం పొడుగు ఆరు అడుగులు దాటివుంటాడు. పుష్టికి ఛాతీకొలిస్తే ఏనలభై అంగుళాలో వుండగలదు. ఒదులొదులు షరాయిమీద కమీజు కమీజు మీద చేతుల్లేని పొట్టికోటు, నెత్తిమీద తోకకుచ్చు మరాటీ కుచ్చు రెండూకూడా వున్న తలపాగా చేతిలో చిన్నకమిజీలాంటి బెత్తం బూట్సు అంతా అదో దేశంకాని దేశము మనిషిలాగనిపించేవాడు. ముఖంలో మగరూపం రంగులో బంగారుచాయ ఁ రెండూ తప్పిస్తిమా అతగాణ్ణే తప్పిపోయామన్న మాటే.

భాష ఉర్దూ కాదు, హిందీ కాదు. దానినెదో భాషంటారు లాగుంది. మఱచిపోయాను పుష్టూభాషేమో? ఏమైతేం ఈ కథంతా తెలుగు భాషలోనే వ్రాస్తూవున్నాను కాబట్టి అతగాడి